క్లుప్తంగా

కూకట్లపల్లిలో రేపు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ ఆదివారం తెలిపారు. మొదటి విడత క్యాంపులో చూపించుకున్న రోగులు కేస్ షీట్‌లు రిపోర్టులతో పాటు కొత్త రోగులు శిబిరానికి హాజరై అన్ని పరీక్షలతో వైద్యం చేయించుకోవచ్చన్నారు. క్యాంపును కూకట్లపల్లితో పాటు ఆ సచివాలయం పరిధిలోని యానాది సంఘం వాసులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు.

రేపు జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక కార్యక్రమం సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి చెరుకూరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు బరువు 85 కేజీల లోపు ఉండాలని, ఎంపికైన క్రీడాకారులు మార్చి 3వ తేదీ నుంచి 5 వతేదీ వరకు విశాఖ పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసి మహారాష్ట్రలో మార్చి 21 నుంచి 24వ తేదీ వరకు సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర జట్టు తరపున వారు పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 98486 06573, 63010 15775లను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు కారంచేడులో వలంటీర్లకు వందనం

కారంచేడు: గ్రామీణ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్ల పంపిణీలో కీలకంగా ఉండే గ్రామ వలంటీర్లను సత్కరించుకొనేలా వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మండల కేంద్రం కారంచేడు డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో ఎంపీపీ నీరుకట్టు వాసు బాబు అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా మండలంలోని వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యురాలు, అన్ని గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మండలంలోని నాయకులతో సమీక్ష, ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ ఏ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

పర్చూరులో..

పర్చూరు (చినగంజాం): పర్చూరు గ్రామంలో అద్దంకి నాంచారమ్మతల్లి కళ్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమన్వయకర్త యడం బాలాజీ పాల్గొనున్నట్లు వారు తెలిపారు. అనంతరం 5 గంటలకు పర్చూరు మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన మదనగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శనివారం రథోత్సవం నిర్వహించగా ఆదివారం చూర్ణికోత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ఆర్వీ రంగాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా దేవస్థాన 14వ ధర్మకర్తలు జక్కా రమేష్, జక్కా మోహన మురళీధరరావులు, కార్యనిర్వహణాధికారి బండ్ల శ్రీలత పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, మాఘమాసం, పుబ్బ నక్షత్రం, విదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటా..



ప్రజల సమస్యలపై మాట్లాడుతున్న సమన్వయకర్త బాలాజీ



బాలాజీని కలిసిన చినగంజాం ఇస్లాంపేట ముస్లింలు

● నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా తాను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటాను.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం పర్చూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాలాజీ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు, కార్యకర్తల సమస్యలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు ఆయా గ్రామాలలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, పర్చూరు మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, గాజుల రమేష్, దాసరి వెంకటరావు, షేక్ కాలేషా, కొట్టే ప్రభుదాసు, ద్రోణాదుల సర్పంచ్ భాగ్యారావు, కంచెనపల్లి రమేష్, గాదె సురేష్, జంగా అనిల్, ఆకుల హేమంత్, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి ఉన్నారు.

సమన్వయకర్తను కలిసిన ముస్లింలు

మండల కేంద్రమైన చినగంజాం ఇస్లాంపేటకు చెందిన ముస్లింలు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీని ఆదివారం ఆయన నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముస్లింలు తమ కాలనీలో స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో షేక్ హుసేన్, పఠాన్ సుభానీ, జాఫర్ వలీ, మహమ్మద్ ఇష్తికార్, గఫూర్ రహమాన్, షాహిద్ బ్రదర్స్, షేక్ బాబు, షేక్ బాజీ ఉన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే

● రచ్చబండ కార్యక్రమంలో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



మహిళలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారం చేపట్టేది వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని తూర్పుపాలెం గ్రామస్తులు ముక్తకంఠంతో ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మండల కేంద్రం కొరిశపాడు గ్రామం తూర్పుపాలెంలో రచ్చబండ కార్యక్రమాన్ని నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామానికి విచ్చేసిన హనిమిరెడ్డికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులు, గుమ్మడి కాయలతో దిష్టి తీసి పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అందరినీ ఆప్యాయంగా పలకరించిన హనిమిరెడ్డి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఈసారి అద్దంకిలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే అని పేర్కొన్నారు. గ్రామస్తులందరూ ఏకతాటిపై ఉండి హనిమిరెడ్డి విజయానికి కృషి చేస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పల్లెర్ల శ్రీనివాసరెడ్డి, నరసారెడ్డి, తదితరులతో పాటు మండల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి చేయూత

బల్లికురవ: విద్యుదాఘాతంతో శనివారం మండలంలోని పాత మల్లాయపాలెంలో సర్వం కోల్పోయిన ఉయ్యాల కోటేశ్వరరావుకు ప్రభుత్వ పరంగా చేయూతనిచ్చినట్లు వీఆర్‌వో రత్నం రాజు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ డీ. సతీష్ తెలిపారు. తక్షణ సాయంగా నిత్యావసరాలు అందించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెప్పారు. ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన రైస్‌కార్డు, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు స్థానంలో నూతన కార్డులు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సతీష్ వివరించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి డీ. బ్రహ్మారెడ్డి ఆర్థిక సాయానికి తోడు గ్రామస్తులు ఇతోధికంగా సాయం అందిస్తున్నారు.



బాధితుడికి నిత్యావసరాలు అందిస్తున్న అధికారులు

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులమత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్న సంక్షేమ పథకాలను తామంతా ఆకర్షితులైనట్లు వల్లాపల్లి ముస్లిం ఎస్సీ కాలని వాసులు తెలిపారు. ఆదివారం రాత్రి గ్రామ దర్శిని కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ ఇన్‌చార్జి డీ. బ్రహ్మారెడ్డి రెండు కాలనీలో పర్యటించి కాలని వాసుల సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ అధికారాన్ని చేపట్టాక ముస్లిం కాలనీలో అసంపూర్తిగా నిలిచిన షాదీఖానా, అంతర్గత రోడ్లు ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు, సైడు కాలువలు అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. సచివాలయ వలంటీర్ల వ్యవస్థ ద్వారా పథకాలన్ని లబ్ధిదారులఖాతాలకు నేరుగా జమ అవుతున్నట్లు చెప్పారు. రెండోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను అద్దంకి ఎమ్మెల్యేగా పానెం చిన హనిమిరెడ్డి విజయానికి తామంతా సమిష్టికా కృషి చేస్తామని నేతలు ప్రకటించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగేదిలేదని పార్టీ విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో వల్లాపల్లి మాజీ సర్పంచ్ షేక్ అల్లాఉద్దీన్, ఉపసర్పంచ్ షేక్ ఖాసింవలి, నేతలు షేక్ షుకుర్, బాషా, ఇమాంవలి, సర్కార్, మందా సుబ్బారావు, చిన కొండ్రు, తదితరులు ఉన్నారు. బ్రహ్మారెడ్డి వెంట వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరారెడ్డి, స్థానిక నేతలు మద్దినేని అశోక్, ఏల్చూరి రవీంద్ర, పావులూరి చందు తదితరులు ఉన్నారు.



వల్లాపల్లి కాలనీ వాసులతో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి

తీరంలో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

చీరాల టౌన్: ఆహ్లాదంగా సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండి లోతుకు వెళ్లకుండా స్నానాలు ఆచరించాలని రూరల్ ఎస్సై శివకుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని వాడరేవు సముద్ర తీరప్రాంతాల్లో పర్యాటకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాన్ని చూస్తే అందరికి ఉత్సాహం, ఆహ్లాదం కలుగుతాయని పర్యాటకులు అప్రమత్తంగా ఉండి లోతుకు వెళ్లకుండా స్నానాలు చేయడం వలన ప్రాణాపాయ పరిస్థితులు రావన్నారు. సముద్రంలో లోతుకు వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు పాటించి విహార యాత్రలను ఆనందించాలని, కొందరు అలల తాకిడి గురై ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారన్నారు. అప్రమత్తంగా ఉండి పోలీసు ఆంక్షలు పాటిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతీ ఆదివారం, ముఖ్యమైన పండుగలు, వారాంతపు సమయాల్లో పోలీసు బందోబస్తు, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.



పర్యాటకులకు హెచ్చరికలు చేస్తున్న రూరల్ ఎస్సై శివకుమార్

మాతృభాషతో మానసిక విజ్ఞానం

వేటపాలెం: మాతృభాషతో మానసిక విజ్ఞానం కలుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని స్థానిక జోతిరాపూలే బాలుర గురుకుల పాఠశాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్ పీవీ అంజనీకుమారి మాట్లాడుతూ 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని కవులు పూర్వకాలమే చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచ భాషల్లో తెలుగు భాష అత్యంత సుందర సుమనోర్మమైనదన్నారు. తెలుగు సంగీత ప్రాధాన్యత కలిగిన భాషని పద్య, విద్యకు అవధాన ప్రక్రియకు అతిథ్యమిస్తున్న అగ్ర భాషగా గుర్తించారని తెలిపారు. మరో ముఖ్య అతిథి కలాం యువతేజం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కరీముల్లా మాట్లాడుతూ పరభాషా జ్ఞానాన్ని ప్రతి మనిషి నేర్చుకోవాలన్నారు. అయితే తల్లి భాషలో మాత్రమే సంభాషించాలని గుర్తుచేశారు. ఏ భాషనైనా వ్యక్తీకరించే భాషా సంపద ఒక్క తెలుగు భాషలో మాత్రమేకలదన్నారు. హెచ్‌ఎం నారాయణ స్వామి మాట్లాడుతూ 'పాలమీగడ కన్న పాయసాన్న కన్న తియ్యనైనది తెలుగు భాష'ని కొనియాడారు. అనంతరం ముఖ్యఅతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అంజనీ కుమారిని సన్మానిస్తున్న పాఠశాల హెచ్‌ఎం సిబ్బంది

సేవా కార్యక్రమాలకే ట్రస్ట్ ప్రాధాన్యం



శిబిరానికి భారీ ఎత్తున హాజరైన ప్రజలు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 942 మంది హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సంపర్కం అభియాన్ నిర్వహణ

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం దళిత రచ్చబండలో భాగంగా బస్తీ సంపర్కం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులోని కర్నూలు రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.దేవానంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రవి శంకర్, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్, అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, జోనల్ ఇన్‌చార్జి పేముల మోజీ, తోగంటి శ్రీనివాస్, సంగం శ్రీనివాస్, శివాజీ, కోటేశ్వరి, రాజశేఖర్, అజయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు.

వాల్మీకి మహర్షి రామాయణంపై ప్రవచనం



శ్రీనివాసులుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: రామాయణం ఆదికావ్యం, శ్రీరామ కథ మధురాతి మధురం, మానవతా విలువలకు ప్రతీక వాల్మీకి రామాయణం అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసముడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. ఒంగోలు మండలం వలేటివారిపాలెంలో వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలో వాల్మీకి రచించిన సంపూర్ణ రామాయణ ప్రవచనాన్ని పొన్నూరు శ్రీనివాసులు ప్రారంభించారు. 24 వేల శ్లోకాలతో బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ, ఉత్తరకాండలుగా రాముడి చరిత్రను వాల్మీకి మహర్షి జనులకు అందించారని అన్నారు. రామాయణ పారాయణ, ప్రవచనం, గానం, సర్వోత్కృష్టమైనదని అన్నారు. పది రోజుల పాటు జరిగే వాల్మీకి సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞానికి విచ్చేసిన పొన్నూరు శ్రీనివాసులుకు నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోదండరామస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించిన అనంతరం ఉపన్యాస యజ్ఞాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సాయికుమార్, శ్రీవారి సేవకులు పొత్తూరి బదరి గోపాల్, అర్చకులు పాల్గొన్నారు

గ్రూప్-2 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ

అద్దంకి: పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆదివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఐదు సెంటర్లలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీఈవో నారాయణ ఉన్నారు.



పరీక్ష సెంటర్ అధికారులతో మాట్లాడుతున్న జేసీ

బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన నక్కల సుబ్బారావు ఆదివారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదలకు సాయం చేసే విషయంలో జగనన్న ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, ఎంపీటీసీ నూతలపాటి రాములు, కోఆప్షన్ సభ్యులు ఖాశీం, పంగులూరు నాయకులు తిరుపతిరావు, ముప్పనేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న శ్రీనివాసరెడ్డి

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్



ఇంకొల్లులో ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): ఎన్‌సీసీ విద్యార్థులు రెండు సంవత్సరాలపాటు తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో ఉన్నతమైన భావిభారత పౌరులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని ఎన్‌సీసీ ప్రత్యేక అధికారి కల్నల్ సునీల్ గౌతమ్ అన్నారు. మండలంలోని ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఏ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి అలవలపాటి శ్రీమన్నారాయణ పర్యవేక్షణలో పర్చూరు డివిజన్‌లోని ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 231 ఎన్‌సీసీ విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఉదయం రాత పరీక్ష, మధ్యాహ్నం డ్రిల్ టెస్ట్, మ్యాప్ రీడింగ్, 22 రైఫిల్, కంపాస్, వెపన్ ట్రైనింగ్‌లపై పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వాహకులుగా ఎన్‌సీసీ అధికారులు జీ శ్రీనివాసరావు, సాంబశివరావు, ఆర్మీస్టాఫ్ సుబేదార్ సత్యేందర్‌సింగ్, దీపక్ ముర్ముమ్‌లు వ్యవహరించారు.

ఎన్‌సీసీ పరీక్షకు 361 మంది హాజరు..

చీరాల అర్బన్: 23 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ చీరాల కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ ఏ పరీక్షను ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. పరీక్షకు 23 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ పరిధిలోని 9 పాఠశాలల నుంచి 361 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్, రాత పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో సుబేదార్ అవతార్ సింగ్, సెకండ్ ఆఫీసర్ పి.సురేష్, నాయక్ సుబేదార్ రేఖరామ్, బీహెచ్ఎం రమేష్, నాయక్ సునీల్, సెకండ్ ఆఫీసర్ సుబ్బారావు, సెకండ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హనుమంతరావు, కేర్ టేకర్ ఆంజనేయులు, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో సర్టిఫికెట్ పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

నేటి నుంచి వినాయకుడి వాయు ప్రతిష్ట ఉత్సవాలు



బల్లికురవలో నిర్మించిన వరసిద్ధి వినాయకుడి ఆలయం



ప్రతిష్ట కోసం ఏర్పాటు చేసిన యాగశాల

బల్లికురవ: గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తుల సమష్టి కృషి సుమారు రూ. 35 లక్షలతో బల్లికురవలో నిర్మించిన వరసిద్ధి వినాయకుడి వాయు ప్రతిష్టకు సోమవారం నుంచి వేడుకలకు అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం తెలిపారు. బల్లికురవ నుంచి కొమ్మాలపాడు వెళ్లే రోడ్డుకు దక్షిణ భాగంలో ఆలయాన్ని నిర్మించారు. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన వేదపండితులు కొప్పరం సుబ్బయ్య బృందంచే సోమవారం యాగశాల ప్రవేశంతో కలశపూజ, హోమాలు మంగళవారం వరసిద్ధి వినాయకుని ధన్యాధి, క్షీరాధి, జలాధి వాసాలతో బుధవారం ఉదయం 10.16 గంటలకు ప్రతిష్ఠించనున్నారు. వేడుకల్లో భాగంగా వ్యాపార వ్యవసాయ పనుల నిమిత్తం రాష్ట్రంతో పాటు సుదూర ప్రాంత్రాలకు వెళ్లిన గ్రామస్థులంతా తరలి రావటంతో ప్రతి ఇంటా కోలాహలంగా పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల ముగింపులో భాగంగా బుధవారం అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో గ్రామస్తులంతా పాల్గొని ప్రతిష్ఠా వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కరవది హైస్కూలుకు రూ.4 లక్షల విరాళం

ఒంగోలు రూరల్: ఎస్ఆర్ఐలు, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా కరవది జిల్లా పరిషత్ హైస్కూలుకు రూ.4 లక్షల విరాళం అందజేశారు. కరవది హైస్కూలులో ఆదివారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో తాము చదువుకున్న కరవది హైస్కూలు అభివృద్ధి పనులకు విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. వారంలో పనులు ప్రారంభించి పూర్తిచేయనున్నట్లు చెప్పారు. తొలుత పాఠశాలలో ఉన్న వంటగదిని విస్తరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం బాలబాలికల సైకిల్‌స్టాండు నిర్మాణాలు, ప్రహరీ, గేటు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని ఎస్.లక్ష్మీకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థిని లక్ష్మీకుమారి, పాల్గొన్న పూర్వ విద్యార్థులు